



బతుకు పోరు

మండుటెండలోనూ పనిలో పండుటాకులు ● రిక్షాలు లాగుతూ..రోడ్లు ఊడుస్తూ..చెప్పులు కుడుతూ..



క్వింటాల కొద్దీ బరువును మండుటెండలో తీసుకెళ్తున్న పెద్దాయన



కుటుంబానికి తోడుగా.. దుస్తులు ఉతుకుతున్న వృద్ధురాలు

నెత్తిన సూరీడు మండిపోతున్నాడు. బయటకొస్తే.. నిప్పల కొలిమి. ఇంట్లో ఉంటే ఊపిరాడదు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు బతుకుపోరు సాగిస్తున్నారు. వీరంతా దాదాపు ఏడు పదుల వయస్సు మీరిన వారే కావడం గమనార్హం. వీరికి కొడుకులు.. కుమార్తెలు ఉన్నా.. పట్టించుకుంటున్నారో లేదో తెలీయదు గానీ మండుటెండలోనే బతుకుబండి ఈడుస్తున్నారు. ఏ పాటి చిన్న ఎండ తగిలినా.. బాబోయ్ ఎండలు మండిపోతున్నాయంటూ ఫ్యాన్లు.. ఏసీల ముందు కూర్చుంటాం. అటువంటిది మండుటెండలో బండిపై క్వింటాలకొద్దీ బరువును లాక్కెళ్తూ.. జీవిత చక్రాన్ని ఈడ్చుకెళ్తూ 'సాక్షి' కంటపడ్డారిలా. ఏడు పదుల వయసులో ఓ అమ్మ చెప్పులు కుడుతూ కనిపించింది. ఓ పెద్దాయన తోపుడుబండిపై లగేజీ తీసుకెళ్తూ కనిపించాడు. ఇలా ఎందరో వయసు మీరిన వృద్ధులు పొట్టకూటి కోసం మండుటెండను లెక్కచేయకుండా.. బతుకుబండిని లాగుతున్నారు.

-డాబాగార్డెన్స్

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మద్యం కారణంగా ఇద్దరి ఆత్మహత్య

భర్త మద్యానికి బానిసవడంతో భార్య, ఇంట్లో వాళ్లు మందలించారని మరొకరు

మహారాణిపేట: మద్యానికి బానిసగా మారిన భర్త వేధింపులు తట్టుకోలేక భార్య, అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసగా మారడంతో తల్లిదండ్రులు మందలించారని మరొకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగాయి. వేర్వేరు చోట్ల జరిగిన ఈ సంఘటనలపై పోలీసులు అందించిన వివరాలు..

పాత నగరానికి చెందిన కనకమహాలక్ష్మి(20) భర్త నిత్యం మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. ఎన్నిసార్లు పెద్దల సమక్షంలో మందలించినా తన వైఖరి మానుకోలేదు. దీంతో విరక్తి చెందిన కనకమహాలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి కారు అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కొత్త జాలేరిపేటకు చెందిన బూతి వీరేంద్ర(32) అల్లరిచిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యతల్ని గాలికి వదిలేశాడు. ఇన్నేళ్లు వచ్చినా కుటుంబం గురించి పట్టించుకోకపోవడం ఇంట్లోవాళ్లు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన వీరేంద్ర మెడకు ఉరి వేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ఆదర్శ్'లో జాబ్ మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మేళాలో హనీ గ్రూప్ సంస్థలో కొలువులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2022 నుంచి 2025(చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులూ అర్హులే) ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు



పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు తప్పనిసరి

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పాస్టర్ ప్రవీణ్ పోస్టుమార్టం నివేదిక వెల్లడించాలి

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ



మహారాణిపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం చేస్తున్న కాలయాపన వల్ల రాష్ట్రంలోని క్రైస్తవులు, ఇతర మతాల మధ్య లేనిపోని విభేదాలు పెరిగి సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధానికి దారి తీస్తోందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడారు. ప్రవీణ్ మృతి చెందిన సంఘటనా స్థలం నుంచి శవ పంచనామా, పోస్టుమార్టం చేసి శవాన్ని బంధువులకు అప్పగించే వరకు సరైన విధానం లేకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం వల్లే ఈ పరిస్థితికి కారణమన్నారు. పోస్టుమార్టం జరిగి వారం కావస్తున్నా రిపోర్టు వెల్లడించక పోవడం దారుణమన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇలాంటి అంశాల్లో కేసు తీవ్రతను బట్టి ఒకటి రెండు రోజుల్లోనే పోస్టుమార్టం నివేదికను ప్రకటించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వమే ప్రజల్లో అనుమానాలు రేకెత్తించే విధంగా ప్రవర్తిస్తుందని ఆరోపించారు. క్రైస్తవ సమాజం ఎంతో ఓపికతో ప్రభుత్వ సమాధానం కోసం ఎదురు చూస్తుందన్నారు. ఈ అంశంలో కొన్ని పత్రికలు తమ సొంత కథనాలను వండి వారుస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నాయన్నారు. వీటివల్ల రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య తలెత్తితే దానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా వెంటనే పోస్ట్ మార్టం రిపోర్టు, దర్యాప్తు వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని జాన్ వెస్లీ కోరారు.

విశాలాక్షికి ఘన నివాళి



విశాలాక్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు, చిన్నారులు

మహారాణిపేట: స్వాతంత్ర్య సమరయోధురాలు, తామ్రపత్ర గ్రహీత రూపాకుల విశాలాక్షి 99వ జయంతి సందర్భంగా పేద మహిళలకు చీరలు పండ్లు పంపిణీ చేశారు. మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయ ఆవరణలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సాలయం, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో తొలుత విశాలాక్షి చిత్రపటానికి డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమరయోధుల త్యాగాలను, కృషిని గుర్తు చేసుకుని, వారు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, జయంతి శేష అన్నపూర్ణ మౌనిక, గుడా మైథిలి, శ్రీధర్, ఫణికాత్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, రమణ, కొండమ్మ, బంగారమ్మ, మంగ, జయంతి రక్షిత్, సాయి పూజిత తదితరులు పాల్గొన్నారు.

మది దోచిన మధుర గీతాలు



ఇళయరాజా పాటల్ని ఆలపిస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్: స్వర రాగ సుధ అధ్యక్షుడు నేరెళ్ల రమేష్ నేతృత్వంలో స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మేస్ట్రో ఇళయరాజా స్వర పరచిన గీతాలతో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కడలి, రాధ పాడిన ఓ ప్రియా ప్రియా, రమేష్, రంజితల పట్టి తెచ్చానులే, మెలోడీ సత్యనారాయణ, భాగ్యలక్ష్మిల కలయా నిజమా, ఎమ్మెస్ మాధవ్, మణిల ఎదలో తొలి వలపే, ఎస్ఎస్ రావు, సీవీ రాజేశ్వరి ఆలపించిన నీవేగా నా ప్రాణం, అవినాష్, సుజాతల చలీ చలీ నా కొక్కొరకో, దేవరాజ్, మాధవీలత చిరు గాలి వీచెను.. తదితర పాటలు రస హృదయాలను రంజింపజేశాయి. కీబోర్డ్ ప్లేయర్ సోమేష్ బృందం సంగీత నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీస్వరూప వ్యాఖ్యానం అలరించింది. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధి చెన్నా తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.


వైభవోపేతంగా భావనా రుషి కల్యాణం



సీతంపేటలో నిర్వహిస్తున్న భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం

సీతంపేట: సమస్త సృష్టికే వస్త్రాలను సృష్టించి ఇచ్చిన శ్రీభద్రావతి సమేత భావన రుషి స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీతంపేటలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, రాజమహేంద్రవరానికి చెందిన బ్రహ్మర్షి ఆమంచి ఆంజనేయ గురుస్వామి నేతృత్వంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం మేళతాళలతో భద్రావతి సమేత భావనా రుషి స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా హారతులిచ్చి స్వామికి నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుదే రాజు, ప్రతినిధులు గుదే వేణు, గుదే త్రినాథ్, పప్పు ప్రసాద్, బేతా అప్పారావు, ఆకుల శ్రీనివాస్, పెంటకోట శ్రీను, దొడ్డి వాసు, ఉజ్జూరు కృష్ణ, ఇమంది అప్పారావు, బడిగంటి శంకరరావు, పెంటపల్లి సీతారాం, కోసూరి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

మధురవాడ: పొట్ట కూటికోసం ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి సాగిస్తున్న తమను నేరస్తులుగా చూడవద్దని ఆటో కార్మికులు కోరారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు వేధింపులు ఆపాలన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 40వేల మంది ఆటోలు నడుపుతూ, కుటుంబాలు పోషించుకుంటున్నారన్నారు. ఇప్పుడంతా 99 శాతం టికెట్ సర్వీసుల మీదనే ఆధారపడి ఆటోలు నడుపుతున్నారని చెప్పారు. ఆటో కార్మికులపై పోలీసుల తీరు ఇబ్బందికరంగా ఉందని, కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆటోలో కనీసం 8మంది ప్రయాణికులకు అనుమతి ఇవ్వాలని.. అధిక చలానాలు, వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం నార్త్ సబ్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావుకు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జి.చిన్నారావు, రాము, బంగార్రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు ప్రారంభం



కూచిపూడి తరగతులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు, సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్: వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర ఆధ్వర్యంలో ఉచిత కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి కూచిపూడి నృత్యం ప్రత్యేకం అన్నారు. ఏకాగ్రత..భక్తి శ్రద్ధలతో నృత్యాన్ని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కుమార్

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరగనున్న సీపీఎం అఖిల భారత 24వ మహాసభల సందర్భంగా దేశ వ్యాప్తంగా సీపీఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం 10వ వార్డు బి.ఎస్.ఆర్.నగర్‌లో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తమిళనాడు మహాసభలను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. దేశంలో దోపిడీ లేని సమాజ స్థాపనకు సీపీఎం కృషి చేస్తోందన్నారు. ప్రైవేటీకరణల వల్ల దోపిడీ పెరిగిపోతోందన్నారు. అందుకే ప్రైవేటీకరణను అడ్డుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, పీపీపీ విధానంతో ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్‌పరం అవుతున్నాయన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్లు అమర్చడం, ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరావు, నాగరాజు, రమణ, మణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం



మధురవాడలో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న కుమార్

మధురవాడ: సీపీఎం పోరాట వారసత్వం నిరంతరం కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌కెఎస్‌వీ కుమార్ అన్నారు. ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకు పార్టీ జాతీయ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మధురవాడ పీహెచ్‌సీ, మార్కెట్ తదితర ప్రాంతాల్లో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపి, ఇబ్బందుల పాల్జేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సియాద్రి పైడితల్లి, డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, జి.కిరణ్, ఆర్.రవి, వి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



అల్లిపురం మస్జీద్ ఈ ఫిర్దోస్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



నమాజ్‌లో చిన్నారులు



ఈద్ ముబారక్



ఆత్మీయ ఆలింగనంతో శుభాకాంక్షలు

అల్లిపురం: రంజాన్ వేడుకలు సోమవారం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఆదివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో పవిత్ర రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదాంబ దరి మక్కా మసీదు, రిజర్వ్‌లైన్ మసీదు, అల్లిపురం యాతపేట వద్ద గల మస్జీద్ ఈ ఫిర్దోస్, కోటవీధి మసీదులతో పాటు ఏవీఎన్ కాలేజీ దరి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు కొత్తబట్టలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పిల్లలు పెద్దలు నుంచి ఈద్ (బహుమతులు) అందుకున్నారు. వారి కుటుంబాలు, స్నేహితులతో కలసి పండగను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరూ తమకు తోచిన ద్రవ్యాలను దానం చేశారు. మసీదుల వద్ద నిర్వాహకులు సీతల పానీయాలు అందజేశారు.

నేటి నుంచి వాణిజ్య సంస్థలు, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఉచితం

- షాపింగ్ బిల్/సినిమా టికెట్ చూపిస్తే చాలు
- 'క్రో' ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసనాయుడు

డాబాగార్డెన్స్: వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుం వసూళ్లపై పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ(ఎంఏయూడీ) ఉత్తర్వుల్ని ఈ నెల 1 నుంచి తప్పనిసరిగా అమలు చేయాలని కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్(క్రో) ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో షాపింగ్ బిల్, సినిమా టికెట్ చూపిన వారి నుంచి ఎలాంటి పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి వీల్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్-2016 ఆధారంగా రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్యకలాపాలకు వర్తించే ఏపీ బిల్డింగ్ రూల్స్-2017ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అందులో పేర్కొన్నట్లు భవనాల్లో పార్కింగ్ స్థలం తప్పనిసరన్నారు. రాష్ట్రంలోని మాల్స్, మల్టీప్లెక్స్‌లు తదితర వాటి నుంచి పార్కింగ్ రుసుం వసూలుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్కింగ్ దుర్వినియోగ నిరోధానికి పురపాలక శాఖ తాజా మార్గదర్శకాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. తొలి అర్ధగంట వరకు పార్కింగ్ ఉచితమని, 30 నిమిషాలు పైబడి గంట వరకు వాహనం పార్కింగ్ చేసిన వ్యక్తి ఆ మాల్లో ఎంతైనా బిల్లింగ్ చేసినట్లు రసీదు చూపితే అది కూడా ఉచితమేనన్నారు. గంటకు పైగా పార్కింగ్ చేసినవారు సంబంధిత మాల్/మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువు చూపించకపోతే పార్కింగ్ రుసుం వసూలు చేయవచ్చన్నారు. షాపింగ్ బిల్లు, సినిమా టికెట్ చూపిస్తే ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. సమావేశంలో సంస్థ జాతీయ కార్యదర్శి మూల వెంకటరావు, ఏపీ స్పోక్స్ పర్సన్ కరణం రెడ్డి నరసింగరావు, కార్యదర్శి రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు దీపక్‌వర్మ, సునీల్, లోగిన గణేష్, గోపి, శశి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగం

- పదవీ విరమణ సభలో కంటతడి పెట్టిన ఉద్యోగులు
- భారంగా వీడ్కోలు



పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

ఉక్కునగరం: సాధారణంగా ఉద్యోగులు రిటైర్‌మెంట్‌కు ఒకటి రెండేళ్ల ముందు నుంచే సంసిద్ధమవుతారు. ఉద్యోగ విరమణ తర్వాత ఏం చేయాలి.. ఎలా ఉండాలి... ఎలా గడపాలి అనే ప్రణాళిక రచించుకుంటారు. అదే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్‌ఎస్) అయితే కేవలం నెలన్నర ముందు దరఖాస్తు చేయాలి. అంత తక్కువ వ్యవధిలో ఉద్యోగులు భవిష్యత్తు ప్రణాళిక రచించుకోవడానికి సమయం ఉండదు. అదే పరిస్థితి ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో నెలకొంది. స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్య తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వీఆర్‌ఎస్ ప్రకటించింది.

కోతలతో మొదలైన కష్టాలు

ఉక్కు యాజమాన్యం గతేడాదిగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో పాటు హెచ్‌ఆర్‌ఏ నిలిపి వేయడం, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎత్తేయడం, ఇన్సెంటివ్ కనీస స్థాయికి తగ్గించడం వంటి చర్యలకు దిగడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇలా ఎన్నాళ్లు నెట్టుకు రావాలో తెలియని పరిస్థితిలో భవిష్యత్తు గురించి కూడా ఆలోచించకుండా వీఆర్‌ఎస్‌కు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఇలా 1613 మంది దరఖాస్తు చేసుకోగా అందులో సుమారు 248 మంది ఉపసంహరించుకున్నారు. కొంత మంది దరఖాస్తులను యాజమాన్యం తిరస్కరించింది. చివరకు 1126 మంది వీఆర్‌ఎస్‌కు ఆమోదం తెలిపింది.

అలా రిటైర్ అయిన వాళ్లకు నిర్వహిస్తున్న సత్కార కార్యక్రమాల్లో కొంతమంది భావోద్వేగానికి గురైతే మరికొంత మంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. ఉద్యోగులను వదిలి వెళ్తున్న వీఆర్‌ఎస్ ఉద్యోగులు బాధ్యతల అప్పగింతలు, కుటుంబ సభ్యులతో పలకరింపులు ఇలా ఎక్కడ చూసినా ఉద్విగ్న వాతావరణం కనిపించింది. రేపటి నుంచి తాము ఏం చేయాలి... భవిష్యత్తు ఏంటనే దిగులుతో ఉన్నవారే ఎక్కువగా కనిపించారు. కాగా పదవీ విరమణ కార్యక్రమం అనతరం ప్లాంట్ నుంచి బయటకు వచ్చిన వారిని తమ కుటుంబ సభ్యులు సత్కరించారు. మరికొంత మంది ఓపెన్ టాప్‌లో ఊరేగుతూ ఇంటికి చేరుకోవడం కొసమెరుపు.